జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 10-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 159 పేజీలు: 8 వెల : రూ.7



**ఈ వ్యవహారాలతో త్వరలో మరిన్ని సాక్ష్యాధారాలు, సమగ్రసమాచారంతో మరో కథనంలో మీ ముందుకువస్తాం.**

# ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలో.. ఇంటిదొంగ

- ✻ ఒడిశా వేరుశెనగ లారీలు పక్కదారి
- ✻ లోడుకి రూ.5వేలు కలెక్షన్
- ✻ సొంత జేబును నింపుకుంటున్న ఉద్యోగి
- ✻ పలాస మార్కెట్ కమిటీలో ఉన్న మరో ఉద్యోగి సహకారం
- ✻ పలాస వద్ద కలెక్షన్ పాయింట్
- ✻ చిరుద్యోగికి కొందరు అధికారులు, పాలకవర్గం అండదండలు
- ✻ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న చిరుద్యోగి

**ఇంటి దొంగను ఈశ్వరుడు అయిన పట్టలేడు అంటారు. అలాంటిది ఈశ్వరుడే దొంగ అయితే ఇక అంతు ఏముంది. లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి సొంత జేబులోకి నింపుకుంటున్న వైనం ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే జాతీయ రహదారిపై అడ్డగోలుగా దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఏకంగా ఒక చిరుద్యోగి సహచర సిబ్బందికి మస్కా కొట్టి సొంత జేబు నింపుకుంటున్నాడు. షాహుకారు.. షాహుకారు గొడవ పడితే చింత పండు రేటు బయట పడినట్లు అయ్యింది.**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 9 (వార్త):**
ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఒక చిరుద్యోగి సరికొత్త దందాకి తెరలేపాడు. గతంలో కరపాడు టోల్‌గేట్ దగ్గర ఉండే చెక్ పాయింట్ బెల్లుపడ పాత టోల్‌గేట్ దగ్గరకు మార్చారు. వెస్ట్ బెంగాల్, ఒడిశా, నుంచి వేరుశెనగ వంటి వ్యవసాయ ఉత్పత్తులు రాష్ట్రంలోకి రవాణా చేస్తుంటారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి నెయ్యి, జీడి పప్పు ఒడిశా, వెస్ట్ బెంగాల్‌కు రవాణా అవుతుంది. వీటికి మార్కెట్ సెస్ వసూలు చేస్తుంటారు. ఒక లోడుకి సుమారు 20 వేల రూపాయలు వరకు సెస్ ఉంటుంది. కానీ ఆ చిరుద్యోగి ఒడిశాకి చెందిన ఓ బడా వ్యాపారవేత్తతో డైరెక్ట్‌గా లింకులు పెట్టుకుని కేవలం లోడుకి 5 వేలు రూపాయలు ఇస్తే చాలు ఎటువంటి సెస్‌లు చెల్లించకుండా నేరుగా విడిచిపెట్టి జేబులోకి నింపుకుంటున్నానే విమర్శలు ఉన్నాయి. సదరు ఉద్యోగికి కొంతమంది ఉన్నతాధికారులు పరిచయం ఉండడంతో వాళ్లని ప్రసన్నం చేసుకొని వాళ్ల ఆశీస్సులతోనే ఇదంతా తెరలేపుతున్నారని తెలుస్తుంది. సాటి ఉద్యోగులు ఎవరైనా ఈ విషయం బయటకు పొక్కేలా చేస్తే సంబంధిత ఉద్యోగులపై ఫిర్యాదు చేస్తూ చర్యలు తీసుకునేలా పాల్పడుతున్నట్లు తెలిసింది. గతంలో పనిచేసిన పాలకవర్గాలను సైతం తన చేతుల్లో పెట్టుకొని వారికి కావలసినవి ముట్టజెప్పి వారిని కూడా ప్రసన్నం చేసుకొని లబ్ధి పొందుతున్నట్లు సమాచారం. గతంలో పనిచేసిన కొంతమంది పాలకవర్గం నాయకులతో కలిసి అడ్డుకుంటున్న సిబ్బందిపై వేటు వేయడం ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఏకంగా కొత్త కార్లుకొని ఈఎంఐలు కూడా చెల్లిస్తున్నారంటే దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. వేరుశెనగ లోడ్లు జిల్లాలోని పలాస, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు మాత్రమే మిల్లులకు వెళుతుంటాయి. దీంతో జిల్లా పరిధిలో ఉన్న మార్కెట్ కమిటీలతో మాట్లాడి లోడ్లను దాటించేస్తున్నాడు. పలాసలో మార్కెట్ కమిటీలో ఉన్న మరో ఉద్యోగి సహకారంతో పలాస నుంచి ఒడిశా, వెస్ట్ బెంగాల్ రవాణా అవుతున్న జీడిపప్పు లోడ్లు కూడా రాష్ట్రం దాటించడానికి పలాస లోనే కలెక్షన్ చేసుకునే వెసులుబాటు తీసుకొని మార్కెట్ కమిటీ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి కొడుతున్నట్లు తెలిసింది. పలాస తర్వాత రాష్ట్రంలో చివరి చెక్ పోస్ట్ ఇచ్ఛాపురం కావడంతో దందాకు హద్దు లేదు. ఒడిశాలో ఉన్న బడా వ్యాపారి పలాసలో ఉన్న ఇతర సన్నిహితుల సహకారంతో ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే నేరుగా పలాస వద్ద



కలెక్షన్ పాయింట్ పెట్టి అక్కడ నుంచే వసూలుకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈ తరహాలోనే ఆగస్టు నెల 12న ఒక లోడు, సెప్టెంబర్ 18న మరోలోడు ఈ విధంగానే దాటించారు. ఎక్కడో చిన్న ఉద్యోగంలో చేరి పదోన్నతిపై ఎదిగి సాటి ఉద్యోగుల సైతం పక్కనపెట్టి జేబులోకి పెద్ద మొత్తంలో డబ్బులు జమ చేసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. గతంలోనే మార్కెట్ కమిటీలో కోట్ల రూపాయల నిధుల గోల్‌మాల్, దారి మళ్లింపు అంశం ఇంకా దర్యాప్తు దశలో ఉంది. దీనిపై కొంతమంది ఉద్యోగులపై కూడా వేటుపడి చర్యలు తీసుకున్నారు. ఏటా కొట్లాది రూపాయల ఆదాయం వచ్చిన మార్కెట్ కమిటీ రాష్ట్రంలోనే మంచి స్థానంలో ఉండేది. అటువంటిది సిబ్బంది సొంత జేబులోకి నిధులు నింపుకోవడంతో ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతుంది.



## సైబర్ నేరాలు శోధనలో..
# నైపుణ్యమే కీలకం

- ✻ పోలీసులు.. సాంకేతిక నైపుణ్యాన్ని పెంపుదించుకోవాలి
- ✻ ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
- ✻ సైబర్ నేరాలు నియంత్రణ, నేరాల ఛేదనపై గురజాడలో సదస్సు



6లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మంత్రి అచ్చెన్నను కలిసిన టుటౌన్ సీఐ


**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 9(వార్త):** శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించిన పి.ఈశ్వరరావు శనివారం నిమ్మాడలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖకు..

# పూర్వ వైభవం తీసుకొస్తాం

* శ్రీకాకుళం సన్న బియ్యానికి ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి * సుస్థిర సేద్యానికి యంత్రమే మంత్రం
* తన శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరుతా * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * రాగోలులో కిసాన్ మేళా ప్రారంభం

**శ్రీకాకుళం, నవంబర్ 9 (వార్త):** రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు పూర్వ వైభవం తీసుకొస్తామని, రైతులందరినీ ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆరుగాలం కష్టపడ్డ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఉత్తర కోస్తాకు అనువైన లాభసాటి వ్యవసాయ విధానాలు అనే అంశంపై రాగోలులోని ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా స్థానం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'కిసాన్ మేళా'ను రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శనివారం మంత్రి ప్రారంభించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు అధ్యక్షతన జరిగిన ఈ కిసాన్ మేళాలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మార్టేరును తలదన్నేలా రాగోలు పరిశోధన స్థానాన్ని అభివృద్ధి చేస్తామని, శ్రీకాకుళం సన్న బియ్యానికి ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి చేస్తామన్నారు. 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం ద్వారా ప్రతి వారంలో రెండు రోజులు వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు, రైతులు దగ్గరికి వెళ్లి పొలాలు చూసి రైతులతో మాట్లాడి వారికి ఏయే అవసరాలు ఉన్నాయో, కష్టాలు ఏంటి? బాధలు ఏంటని? తెలుసుకొని తద్వారా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. తన శాఖకు




ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరుతానన్నారు. జిల్లాలో సకాలంలో నీరు అందక ప్రతి సంవత్సరం కరువు, కాటకాలతో వ్యవసాయం చేయలేక వలసలు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుందని, దానిని నిరోధించాలని చెప్పారు. అత్యంత ప్రాధాన్యత రంగమైన వ్యవసాయాన్ని గత ఐదేళ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేయడం, కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయకపోవడంతో రైతు పరిస్థితి ఘోరంగా మారిందని అన్నారు. సబ్సిడీపై యంత్రాలను, డ్రోన్లను అందిస్తామని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి సంవత్సరం భూమికి భూసార పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు డ్రోన్ల సాంకేతికతను అందుబాటులో ఉంచామని, రైతులు గ్రూపులుగా ఏర్పడి వాటి సేవలు తక్కువ ధరకు పొందవచ్చని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు కూడా తరచూ ఇలాంటి మేళా లకు హాజరై కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ మాట్లాడుతూ లాభదాయక వ్యవసాయ విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అదృష్టం కొద్దీ వ్యవసాయ శాఖకు మంత్రిగా అచ్చెన్నాయుడు ఉన్నారని, రైతుల ప్రయోజనాల కోసం ఆయన ఎంత దూరమైనా వెళ్లగలరని చెప్పారు. నైపుణ్యాభివృద్ధికి సాంకేతికతను జోడించి యువతను ఈ రంగం వైపు ఆకర్షితులు అయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తొలుత వివిధ శాఖలు ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శనలను ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రచురించిన పలు పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్. ఆర్.శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. వి. సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డా. సి.హెచ్. శ్రీనివాస రావు, డైరెక్టర్ సీడ్స్ డా. వై. సతీష్, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి కె. త్రినాథ స్వామి, డాక్టర్ దానేటి శ్రీధర్, ఉత్తరకోస్తా మండల వ్యవసాయ శాఖాధిపతులు, పెద్ద సంఖ్యలో జిల్లా నుండి రైతులు, ఎఫ్పిఒ, ఎన్జీవో, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లమో విద్యార్థులు ఈ మేళాలో పాల్గొన్నారు.



# గ్రామ స్వరాజ్యం.. కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

* ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

**ఎచ్చెర్ల, నవంబర్ 9 (వార్త):** ఎచ్చెర్ల నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తూ మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో వీఆర్వో నాయుడు సొంత నిధులతో నిర్మించిన బస్ స్టాప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే లావేరు మండలం శహపురం, గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిసి రోడ్డు పూర్తి కోసం మరో రూ.పది లక్షలు అదనంగా మంజూరు చేస్తామన్నారు. లావేరు మండలం శహ పురం గ్రామంలో బొర ముసలయ్యకు చెందిన పూరిల్లు ఇటీవల ప్రమాదశాత్తు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం కింద రూ.పదివేల నగదును అందజేశారు. అనంతరం ప్రభుత్వం తరపున పక్కా ఇల్లు మంజూరు చేస్తానని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. లావేరు మండలం పిన్నింటిపేట(వెంకటరావు పేట) గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, అనంతరం బుడతవలస పంచాయతీలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి పంచాయతీలో పూర్తిస్థాయి సిసి రోడ్లు మంజూరుకు మరికొంత సొమ్మును అదనంగా మంజూరు చేస్తామన్నారు. రూ.40 లక్షల వ్యయంతో రణస్థలం పంచాయతీలో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్రావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసు నాయుడు, జిల్లా పూర్వ అధ్యక్షులు చౌదరి బాబ్జి, మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేష్, స్థానిక నాయకులు మెండ రాజా రావు, భాస్కరరావు, ముప్పిడి సురేష్, తోటయ్యదొర, మీసాల రమణ, ప్రకాశరావు, గొర్లె శ్రీనివాస్ జీరు రామారావు, బోర శ్రీను, పలువురు అధికారులు పాల్గొన్నారు.





## శాశ్వత అన్నదానానికి రూ.లక్ష వితరణ

**అరసవల్లి, నవంబర్9 (వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్య నారాయణ స్వామిని శ్రీకాకుళం జిల్లా పొందూరు వాస్తవ్యులు మలిపెద్ది లక్ష్మీ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం రూ.1,00,116లను ఆలయ సూపరింటెండెంట్ ఎస్. కనకరాజుకు అందజేశారు. తదుపరి వారికి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను లక్ష్మీ కుటుంబసభ్యులకు ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ అందజేశారు.

## అసభ్యకర పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు



**శ్రీకాకుళం క్రైం, నవంబర్9(వార్త):** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, వైసీపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో కొందరు అసభ్యకరంగా జగన్మోహనరెడ్డిపై పోస్టులు పెడుతున్నారని, వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## కొరికానకు పదవి పట్ల హర్షం




**మెళియాపుట్టి, నవంబర్9(వార్త):** శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ నాయకుడు కొరికాన రవికుమార్‌కు శ్రీకాకుళం జిల్లా అర్బన్ అథారిటీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియమించారు. ఈ సందర్భంగా జనసేన మెళియాపుట్టి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మెళియాపుట్టిలో బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నేత కొరికాన రవికుమార్‌కు శ్రీకాకుళం జిల్లా అర్బన్ అథారిటీ చైర్మన్‌గానే కాకుండా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, చింతల ప్రశాంత్, పిట్ట హరికృష్ణ, పత్రి మణికంఠ, పట్నాన ఈశ్వర్ రెడ్డి, సంపతి రావు మాధవరావు, గంప శ్యామ్, పొట్నూరు సాయి, జగదీశ్వరరావు, కోట రమేష్ అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సంతోష్ కుమార్ మృతి



**మందస, నవంబరు 9(వార్త):** మందస పట్టణానికి చెందిన యువ వ్యాపారవేత్త వడ్డి సంతోష్ కుమార్(43) రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైన సంతోష్ కుమార్‌ను పలాస తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. సంతోష్ కుమార్‌కు రాధాకృష్ణపురం గ్రామం సమీపంలో మోడరన్ రైస్ మిల్లు ఉంది. ప్రతీ రోజూ మందస నుంచి రాధాకృష్ణపురం వచ్చి మిల్లులో పనులు చూసుకుని, ఇంటికి వెళ్తుంటారు. ఇటీవల తిరుమల-తిరుపతి వెళ్లి, వెంకటేశ్వరునికి తలనీలాలు కూడా సంతోష్ సమర్పించుకున్నారు. యథావిధిగా శనివారం రాత్రి పనులు ముగించుకుని, మందస పట్టణానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో ఒడిశాకు చెందిన లగేజి ఆటో ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన సంతోష్‌ను 108 అంబులెన్స్‌లో పలాస తరలించారు. చికిత్స పొందుతూ సంతోష్ కుమార్ మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మంచి వ్యక్తిగా గుర్తింపు ఉన్న సంతోష్కుమార్ మరణించడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఇద్దరు చిన్న పిల్లలు కావడంతో ఆయన భార్య రోదనను ఆపడం ఎవరి తరమూ కాలేదు. సంతోష్ కుమార్ మిల్లులో పని చేస్తున్న సిబ్బంది, ఆయన బంధువులు, స్నేహితులు, క్లాస్మేట్స్ మృతదేహం ఉన్న ఆసుపత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## లింగాలవలసలో పోలింగ్ కేంద్రం పరిశీలన



**జలుమూరు, నవంబర్ 9(వార్త):** ఓటర్ల జాబితా సవరణను స్పెషల్ డ్రైవ్ ద్వారా చేపడుతున్నామని తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. శనివారం ఆయన లింగాలవలస పంచాయతీలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతి చెందినవారు ఎవరైనా ఉంటే వెంటనే గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఆ ఓట్లు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించాలి

■ లేకుంటే ఉద్యమిస్తాం ■ ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరిక ■ పలాసలో ఘనంగా జిల్లా మహాసభలు ■ కదం తొక్కిన కామ్రేడ్లు





**పలాస, నవంబర్ 9(వార్త):** కూటమి ప్రభుత్వం వైసీపీ విధానాల్ని కొనసాగిస్తే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఎం 18వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం పలాసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికే సర్దుబాటు చార్జీలు రూ.6,072 కోట్లు మోపి, ఇప్పుడు కొత్తగా రూ.11,000 కోట్లు ప్రజలపై భారం వేయడం దుర్మార్గమని విమర్శించారు. ఈ విద్యుత్ చార్జీల పెంపుతో వినియోగదారులపై ఒక యూనిట్‌కి రూ.1.80లు నుంచి రూ.2.40లు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోస్టల్ కారిడార్ పేరుతో తీర ప్రాంత భూములన్నీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. విధానపరంగా వైసీపీకి, కూటమి ప్రభుత్వానికి ఏ తేడా లేదని విమర్శించారు. ఆంధ్రుల బలిదానాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ జోలికి వస్తే పోరాటంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.తులసీదాస్ మాట్లాడుతూ తీరంలోని ఉప్పు, సీఆర్‌జెడ్ భూములు పోర్టుకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీంతో తరతరాలుగా జీవనం కొనసాగిస్తున్న ఉప్పు రైతులకు నష్టం జరుగుతుందన్నారు. జీడి పిక్కల 80 కేజీల బస్తాకు రూ.16,500 చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని, జీడి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, అమలుచేయాలని, జిల్లాలో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ పాలరేటు తగ్గించడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ వంశధార రెండోదశ పూర్తిచేసి, శివారు భూములకు నీరు ఇవ్వాలని, నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలుచేయాలని, రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సీపీఎం నాయ కులు కోనారి మోహనరావు, బి.కృష్ణ మూర్తి, జి.సింహాచలం, కె.నాగమణి, నంబూరు షణ్ముఖరావు, పి.తేజేశ్వర రావు, సిర్ల ప్రసాద్, పోలాకి ప్రసాద రావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.గణపతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహా ప్రదర్శనతో దద్దరిల్లిన పలాస

**పలాస:** పలాసలో సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా శనివారం భారీ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీ అగ్రభాగాన సాగిన తప్పెటగుళ్లు, కోలాటం, డప్పులు వివిధ కళారూపాలు ప్రజలను ఆకర్షించాయి. కార్మిక జెండాలతో పలాస ఎరుపుమయమైంది. ఈ ప్రదర్శనలో మహిళలు, కార్మిక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తంగుడుని పరామర్శించిన కృష్ణదాస్



**జలుమూరు, నవంబర్ 9(వార్త):** నరసన్నపేటలోని నేతాజీ వీధికి చెందిన జిల్లా రైస్‌మిల్లర్స్ మాజీ అధ్యక్షుడు తంగుడు జోగారావును మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. ఆయన మామగారు చిన్నారి గణపతిరావు ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకుని ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, సుడా మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణగుప్త, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, యువజన విభాగం అధ్యక్షుడు బుద్దల రాజశేఖర్, అటవీ శాఖ మాజీ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, కనపల శేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు పాగోటి భరద్వాజ్, కనపల అరవింద్, తోట భార్గవ్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడికి రూ.10 వేల సాయం



**సోంపేట, నవంబర్ 9(వార్త):** మామిడిపల్లి పంచాయతీ పాతినవలసకు చెందిన తెలుకుల ప్రశాంత్ కొద్దిరోజుల కిందట డాబాపై నుంచి పడి, తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో వైద్యానికే లక్షలాది రూపాయలు ఖర్చయ్యాయి. దీంతో కుటుంబానికి అంతులేని కష్టం వచ్చింది. ఈ నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి సహకారమందిస్తున్నారు. అందులో భాగంగా తాళ్లభద్ర యువజన సేవా సంఘం వారు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. శనివారం సంఘ ప్రతినిధులు బాధిత కుటుంబానికి చెక్కు అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యర్ర గణపతి, నెయ్యిల సింహాచలం, దున్న ఈశ్వరరావు, ఉగ్రపల్లి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉంది




**జలుమూరు, నవంబర్ 9(వార్త):** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అని టీడీపీ నేత రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎంతో గుర్తింపునిచ్చి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్‌చైర్మన్ పదవి అప్పగించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేషన్ సకాలంలో లబ్ధిదారులకు అందించండి

**జలుమూరు, నవంబర్ 9(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని ఆర్డీవో కె.సాయిప్రత్యూష ఆదేశించారు. శనివారం ఆమె పెద్దదూగాం గ్రామం వద్ద లబ్ధిదారులకు అందజేస్తున్న రేషన్ సరుకుల పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. సరుకులు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ వ్యవహారంలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



# భక్తులతో కిటకిటలాడిన శ్రీముఖలింగం



**జలుమూరు, నవంబర్ 9(వార్త):** శ్రీముఖలింగంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వర ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచి భక్తుల తాకిడి పెరుగుతూ వచ్చింది. అయితే వీరి కోసం నీడ ఇచ్చేందుకు టెంట్లు లేకపోవడంతో మండుటెండలో అనేక ఇబ్బందులు పడ్డారు. కార్తీక శనివారం, కోటి సోమవారం, గోఅష్టమి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారని ఆలయ ఈవో ప్రభాకర రావు తెలిపారు.

# ఇసుక ర్యాంపుల్లో లోటుపాట్లపై చర్యలు తీసుకుంటాం

**జలుమూరు, నవంబర్ 9(వార్త):** నరసన్నపేట మండలం గోపాలపెంట గ్రామం వద్ద కొనసాగుతున్న ఇసుక ర్యాంపును శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ మేరకు ఇసుక ర్యాంప్ నిర్వహిస్తున్న సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోటుపాట్లు ఉన్నా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ టి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



## సత్యసాయి సన్నిధిలో అఖండ నామ సంకీర్తన

**మందస, నవంబర్ 9(వార్త):** మందసలోని శ్రీసత్యసాయి సేవా సమితి(బృందావన్)లో ప్రపంచవ్యాప్త దివ్య అఖండనామ సంకీర్తన శనివారం సాయంత్రం ప్రారంభమైంది. సత్యసాయి భక్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ద్విశత దీపారాధన, అఖండ జ్యోతి ప్రజ్వలన, వేద పఠనంతో అఖండ నామ సంకీర్తన ప్రారంభమైంది. 24 గంటల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సేవాసమితి సభ్యుడు వడ్డి అప్పారావు తెలిపారు.





## నీలమణి దుర్గమ్మను దర్శించిన ఎమ్మెల్యే

**పాతపట్నం, నవంబర్ 9(వార్త):** ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గమ్మను పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం అమ్మవారిని దర్శనం చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరుతున్నానన్నారు. పాతపట్నం అభివృద్ధికి తల్లి ఆశీస్సులు కోరానని తెలిపారు.

## కాకర్లవాని చెరువును పరిశీలించిన ఆర్డీవో



**జలుమూరు, నవంబర్ 9(వార్త):** జలుమూరు మండలం పెద్దదూగాం పంచాయతీలోని కాకర్లవాని చెరువును శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష శనివారం పరిశీలించారు. చెరువు నైస ర్గిక స్వరూపాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చెరువుపై కోర్టులో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేప డుతున్నామన్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ అధికారులతో చర్చించారు.

## ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



**జలుమూరు, నవంబర్ 9(వార్త):** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ సవరణకు సంబంధించి స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నామని నరసన్నపేట తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన నరసన్నపేట మండలంలోని మాకివలస ప్రభుత్వ పాఠశాలలో గల 149 పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్వో శ్రీనివాసరావుకు పలు సూచనలు అందజేశారు. ఓటర్ల చేర్పులు–మార్పుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రుద్రయ్య కుటుంబానికి పలువురి పరామర్శ

**మందస, నవంబర్ 9(వార్త):** మందస మండలం దున్నవూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లబ్బ రుద్రయ్య మాతృమూర్తి పోలమ్మ మరణించిన సంగతి తెలిసిందే. శనివారం ఆయనను అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం పరామర్శించారు. తన సానుభూతి తెలిపి, పోలమ్మ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన వెంట అగ్ని కుల క్షత్రియ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బచ్చల మధు, తిమ్మల ఢిల్లేశ్వరరావు, జుత్తు పురుషోత్తం కూడా ఉన్నారు.



# కూటమి పాలనలోనే పల్లెల అభివృద్ధి



**కాశీబుగ్గ, నవంబర్ 9(వార్త):** కూటమి పాలనలోనే పల్లెలు అభివృద్ధి, ప్రగతిపథం వైపు పయనించి, సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ కొండపల్లిలో సీసీ రోడ్డుకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన కొండపల్లి గ్రామంలో నివాసముంటున్న వారికి రూ.11.20లక్షలతో సీసీ రోడ్డు మంజూరు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు సంవత్సరానికి మూడు చొప్పున మంజూరు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. సంక్షేమ ఫలాలు అందజేయడంలో ముందుంటామన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు అరసవెల్లి ఉమామహేశ్వర, శశి, లైసెట్టి భీమారావు, సాతపల్లి కామేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు, గుత్తేదారుడు ఎంపల్ల తులసీరావు, తెలుగుదేశం సీనియర్ నాయకులు జోగారావు, మెట్టూరు ఎంపీటీసీ సభ్యురాలు సురేఖ తదితరులు పాల్గొన్నారు

# జ్ఞానభారతి పాఠశాలకు అరుదైన గౌరవం

**ఇచ్ఛాపురం, నవంబర్9(వార్త):** ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రత్యేక అరుదైన గౌరవాన్ని పొందింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఖుర్దా డివిజన్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలగా గౌరవాన్ని అందుకుంది. అమృత్‌భారతి స్టేషన్స్ స్కీంలో భాగంగా ఖుర్దా డివిజన్ పరిధిలోని సుమారు 42 పాఠశాలల్లో ఖుర్దా డివిజన్ డీఆర్ఎం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ – వికసిత్ రైల్వే ప్రధాన అంశంగా వివిధ కార్యక్రమాలను ఈ ఏడాది ఫిబ్రవరి 19న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొన్నారు. రైల్వే అధికారుల సమక్షంలో వివిధ భాషల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా



ప్రదర్శించారు. పాఠశాల సెక్రటరీ, సీఈవో జోహేర్ ఖాన్ ఆధ్వర్యంలో ఎంతో సమర్ధవంతంగా, ప్రణాళికాబద్ధంగా, ఉన్నత ప్రమాణాలతో ఈ కార్యక్రమం నిర్వహించడంతో, 42 పాఠశాలల్లో ఉత్తమ పాఠశాలగా జ్ఞానభారతిని రైల్వే ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. అత్యుత్తమ పాఠశాలగా ఎంపికైనందుకు ఖుర్దా రైల్వే డివిజన్ మేనేజర్ హెచ్ఎస్ బజ్వా నగదు బహుమతిని ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఖుర్దా రైల్వే డివిజన్ అధికారులు జ్ఞానభారతి పాఠశాలకు విచ్చేసి సీఈవో జోహేర్‌ఖాన్‌కు నగదు రివార్డును అందించారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

**శ్రీకాకుళం టౌన్, నవంబరు 9(వార్త):** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రకటించాల్సివున్నప్పటికీ విజయవాడలో వరద ముంపు కారణంగా ఈ అవార్డుల ప్రధానోత్సవం వాయిదా పడింది. తాజాగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. లావేరు మండలం గోవిందపురం ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ జి.శ్రీనివాసరావు, బూర్జ మండలం ఓవీ పేట స్కూల్







ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావులను ఉత్తమ ఉపాధ్యాయులుగా, నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ ఆరంగి అప్పన్నను ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేశారు. ఈ నెల 11న విజయవాడలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## భార్యాభర్తలపై దాడి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 9 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో ఉంటున్న రమ, సత్యనారాయణ దంపతులు సరస్వతీ థియేటర్ సమీపంలో గల ఓ ప్రవేట్ చిట్స్ బ్రాంచ్‌లో చిట్టీ పాట పాడారు. దీనికి సంబంధించి నెలవారీ వాయిదా లను కడుతున్నారు. అవసరం నిమిత్తం వడ్డీకి నగదు కావాలని ఈ ప్రైవేట్ చిట్టీ బ్రాంచ్ మేనేజర్‌ను ఆ దంపతులు అడిగారు. ఈ నేపథ్యంలో నూటికి రూ.1.50 వడ్డీ చొప్పున రూ.7లక్షలు మేనేజరు ఇప్పించారు. ఏమైందో ఏమోగాని శనివారం సత్యనారాయణ ఇంట్లో భోజనం చేస్తుండగా విశాఖ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు భార్యాభర్తలతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కొందరు ఆ దంపతులపై పెట్రోల్ పోశారు. వారిద్దరూ గట్టిగా కేకలు వేస్తూ పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు గుమిగూడడంతో ఆ వ్యక్తులు వెళ్లిపోయారు. దీనిపై రెండో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గ్రీష్మకు పదవిపై హర్షం



**వంగర, నవంబర్ 9(వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 59మందికి నామినేటెడ్ పదవుల తో రెండో జాబితాను విడుదల చేసింది. ఇందులో రాజాం నియోజకవర్గానికి చెందిన కావలి గ్రీష్మ ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈమె తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకు రాలు, మాజీ స్పీకర్, మాజీ మంత్రి కావలి ప్రతిభాభారతి కుమార్తె. ఈమెను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిక చేయడంపై రాజాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.





## రెండో జాబితాలో.. ఇద్దరికి

* నామినేటెడ్ పదవుల రెండో జాబితాను ప్రకటించింన కూటమి ప్రభుత్వం
* టీడీపీ, జనసేనకు చెరొకటి, బీజేపీకి మొండిచేయి
* కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడిగా రోణంకి కృష్ణంనాయుడు నియామకం
* సుడా చైర్మన్‌గా కొరికాన రవికుమార్

**శ్రీకాకుళం, నవంబరు9 (వార్త):** నామినేటెడ్ పదవుల రెండో జాబితాను కూటమి ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. జిల్లాలో ప్రాధాన్యం కలిగిన కళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్, శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పదవులు ఇద్దరికి వరించాయి. టీడీపీకి చెందిన రోణంకి కృష్ణంనాయుడుకు కళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, జనసేనకు చెందిన కొరికాన రవికుమార్‌కు సుడా చైర్మన్‌గా పదవులు వరించాయి. పాతపట్నం జనసేన పార్టీకి అయిదేళ్లుగా సేవలు అందిస్తూ, సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషిచేసిన కొరికాన రవికుమార్‌ను అధిష్టానం గుర్తించింది. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా నియమించింది. మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన ఈయన పుదుచ్చేరిలో గోల్డెన్ మెరైన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండీగా ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన భార్య భవాని పాలకొండ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీకి జనసేన టికెట్ ఆశించారు. కొరికాన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. అలాగే నరసన్నపేటకు చెందిన టీడీపీ నాయకుడు రోణంకి కృష్ణంనాయుడును రాష్ట్ర కళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. కృష్ణంనాయుడు న్యాయవాది. 1995లో జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికై సేవలందించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. అనంతరం టీడీపీలో చేరారు. బీజేపీ నాయకులు ఈసారి తమకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని ఆశ పడినా రెండో జాబితాలో వారికి కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపింది.

## ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 9(వార్త):** నందిగాం మండలం ఆకుల రఘునాథపురం సమీపంలో హైవేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామానికి చెందిన మహిళలు ఆలయాల దర్శనం నిమిత్తం ఆటోలో వస్తున్నారు. ఆకులరఘునాథపురానికి వచ్చే సరికి రూటు మరిచి పోయి వచ్చేశామని డ్రైవర్ గుర్తించి ఆటోను వెనక్కు తిప్పుతుండగా రౌతుపురం గ్రామానికి చెందిన పూతి చిరంజీవి తన వరుసకు చిన్నాన్న అయిన ధర్మారావుతో కలిసి ద్విచక్రవాహనంపై నరసన్నపేట వెళ్లి తిరిగి వస్తూ ఈ ఆటోను ఢీ కొన్నారు. దీంతో ఆటో బోల్తాపడింది. ద్విచక్రవాహనంపై ఉన్న పూతి చిరంజీవి, ధర్మారావుతో పాటు ఆటో డ్రైవర్ మున్సబుపేటకు చెందిన రాజు, పాత్రునివలసకు చెందిన రాములమ్మ, జగదీశ్వరి, మరో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో చిరంజీవి, ధర్మారావు తది తరులకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ధర్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు.

## సిక్కోలులో క్రీడా సందడి

**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(వార్త):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలురు, బాలికలు బాస్కెట్ బాల్ పోటీలు శనివారం శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో గల ఎన్‌టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో, కోడి రామ్మూర్తి స్టేడియంలో మోడరన్ పెంటాథలిన్ పోటీలు ప్రారంభమయ్యాయి. బాస్కెట్ బాల్ పోటీల్లో బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై శ్రీకాకుళం విజయం సాధించగా, కడపపై గుంటూరు, విజయనగరంపై చిత్తూరు, విశాఖపై ప్రకాశం, కడపపై శ్రీకాకుళం, విజయనగరంపై తూర్పు గోదావరి జట్లు విజయం సాధించాయి. బాలుర విభాగంలో చిత్తూరుపై నెల్లూరు, కడపపై విశాఖ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్లు విజయాలు సాధించాయి. అదేవిధంగా మోడరన్ పెంటాథలిన్‌లో అండర్-17 విభాగంలో 1200 పరుగు, 100 మీటర్ల స్విమ్మింగ్, మరలా 1200 మీటర్ల పరుగుతో ఈవింగ్ కొనసాగించగా, అండర్-19 విభాగంలో 1600 మీటర్ల పరుగు, 200 మీటర్ల స్విమ్మింగ్ మరలా 1600 మీటర్ల పరుగు ఈవెంట్లు కొనసాగాయి. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ తెలియజేశారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్

### -ఎమ్మెల్యే గౌతు శిరీష




**కాశీబుగ్గ, నవంబర్ 9(వార్త):** మానవత విలువలు సనాతన సంప్రదాయ ఆధ్యాత్మిక విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం శ్రీ సత్యసాయి విద్యవిహార్ పాఠశాల విద్యార్థులకు తానా ఫౌండేషన్ యూఎస్ఏ సభ్యుడు గోరింట్ల వాసుబాబు సౌజన్యంతో విలువైన సైన్స్, సోషల్, గణిత మోడల్ పుస్తకాలు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుగ్మతలతో నలుగుతున్న ప్రస్తుత సమాజానికి శ్రీసత్యసాయి విద్య విహార్ స్కూల్ ఎంతో అవసరమని అన్నారు. మానవత విలువలు, సనాతన సంప్రదాయాలతో కూడిన ఆధ్యాత్మిక విద్యతో ప్రస్తుత సమాజానికి అవసరమైన లౌకిక విద్యను కూడా సమస్య స్థాయిలో నేర్పింపబడుతున్న ఇటువంటి స్కూల్ ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీఎస్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఆంధ్రప్రదేశ్ కళింగ కోమటి అధ్యక్షుడు బోయిన గోవింద రాజు, డోకి రామారావు, స్కూల్ కరస్పాండెంట్ మల్ల రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, శరత్, శ్రీను, వీజే రావు, జగదీశ్, భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఏయూను సందర్శించిన పలాస డిగ్రీ కళాశాల విద్యార్థులు

**కాశీబుగ్గ, నవంబర్ 9(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో ఆక్వాకల్చర్ జువాలజీ కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో బీఎస్సీ విద్యార్థులు శనివారం విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ, పరిసర ప్రాంతాల క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆంధ్ర యూనివర్సిటీలోని సైన్స్ లేబరేటరీని సందర్శించారు. అతి పురాతనమైన 1948 నాటి నీలి తిమింగలపు అస్తిపంజరాన్ని, వారి పాఠ్యాంశాలకు సంబంధించిన అనేక జంతు, అవశేషాలను పరిశీలించారు. వాటిపై సమగ్ర నివేదికను తయారు చేసుకున్నారు. ఆక్వా కల్చర్ విద్యార్థుల విషయ సేకరణకు విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌ను, సబ్ మెరైన్‌ను సందర్శించారు. పరిసరాలలో గల పర్యాటక స్థలాలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో ఎంహెచ్ ప్రసాద్, కళాశాల ప్రధానాచార్యులు, వివిధ శాఖాధిపతులు, 40 మంది సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



### జగన్నాథస్వామి
## ఆలయంలో గోపూజ

**ఇచ్ఛాపురం, నవంబర్9(వార్త):** గోఅష్టమి సందర్భంగా ఇచ్ఛాపురంలోని జగ న్నాథస్వామి ఆలయంలో శనివారం గోపూజ నిర్వహించారు. కస్పా గౌడ వీధి, ఒరియా భక్తులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పద్మకుమార్ ఆచార్యులు, దేవదాయ శాఖ అధికారి రామారావు నేతృత్వం లో జరిగింది. గోవులను కార్తీక మాసంలో పూజలు చేస్తే శుభం కలుగుతుందని నమ్మకం.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పెద్దతుంగాంలో ఎలుగు



**సంతబొమ్మాళి, నవంబరు 9(వార్త):** పెద్దతుంగాంలో ఎలుగుబంటి రెండు పిల్లలతో శుక్రవారం రాత్రి సంచరించింది. గ్రామస్తులంతా పెద్దఎత్తున కేకలు వేయడంతో అవి సమీపంలో కొండవైపు వెళ్లిపోయాయి. తరచూ ఎలుగుబంట్లు గ్రామాల వైపు వస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

* హామీలు అమలు కాక అవస్థలు పడుతున్న జిల్లావాసులు
* వ్యవసాయ మంత్రి జిల్లా నుంచే ప్రాతినిధ్యం
* ఏ మేరకు నిధులు తీసుకువస్తారో చూడాలి
* మండలి దృష్టికి జిల్లా సమస్యలు
* దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
* శాసనమండలి సభ్యుడు నర్తు రామారావు

# సూపర్ సిక్స్ హామీలు.. ఏమయ్యాయి?



**కవిటి, నవంబర్ 9 (వార్త):** పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న తాను కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శాసనమండలిలో నిలదీస్తానని శ్రీకాకుళం నియోజకవర్గం స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడునర్తు రామారావు అన్నారు. సోమవారం నుంచి జరగనున్న శీతాకాల సమావేశాలకు మండలికి హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ మేరకు పత్రికలకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ప్రపంచంలో ఎవరు అందివ్వని విధంగా సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి అందించారు. ఆ పథకాలను కొనసాగిస్తూ, అదనంగా మరో ఆరు హామీలను ఇస్తామని వాటికే సూపర్ సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేసి అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఆ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ సంక్షేమ రంగానికి ఎంత ప్రాధాన్యత కల్పిస్తుందో చూడాల్సివుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు మాసాల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే, హామీల నుంచి వారు తప్పించుకునే ధోరణికి అద్దం పడుతోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఇప్పటికే ఖరీఫ్ ముగిసిపోయి రబీ సీజనుకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు సన్నద్ధం అయ్యారన్నారు. వారికి రైతు భరోసా నిధులు ఇప్పటికీ జమ కాలేదన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి డబ్బులు ఊసే ప్రభుత్వానికి లేదన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విద్యార్థుల ఖాతాలకు చెల్లించకపోవడంతో, విద్యార్థులు కుటుంబాలు తీవ్ర ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నాయి. చాలామంది విద్యార్థులకు కళాశాల నుంచి ఇంటికి పంపిస్తున్నట్టు తమ వద్ద సమాచారం ఉందని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన తర్వాత వాలంటీర్ల వ్యవహారంపైన నిర్ణయం తీసుకుంటామని తెలిపి కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల అమలులో మార్పులు ఉండకూడదని ఎమ్మెల్సీ సూచించారు. చట్టసభలో తనకు మాట్లాడే అవకాశం వస్తే జిల్లాలో ఉన్న ప్రధానమైనటువంటి సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గంలో ఉన్న ఇష్యూలను శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ, ఉద్యాన రంగాలకు ఒకప్పుడు పెట్టింది పేరన్నారు. గోదావరి జిల్లాల తర్వాత అంతటి ప్రాధాన్యత ఈ రెండు రంగాలకు మన జిల్లాయే ఉండేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే, సాగునీరు లేక జిల్లాలో సగం నియోజకవర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురై వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా ఉద్యాన రంగం కూడా దిగజారి పోయిందని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయన్నారు. అపార వనరులు ఉన్న జిల్లాను ఇటువంటి పరిస్థితులలో ఆదుకునేందుకు పాలకుల ప్రత్యేక దృష్టి సారిస్తే, వ్యవసాయ కుటుంబాల బతుకుల్లో నిజంగానే పూర్వ వైభవం వస్తుందని చెప్పారు. జిల్లాకు కీలకమైన వంశధార నది జలాలను శివారు నియోజకవర్గాలకు అందిస్తే, బహుద నదికి అనుసంధానం చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం దొరుకుతుందన్నారు. ఏ జిల్లాలో లేనివిధంగా మన జిల్లా నుంచి అధికంగా వలసలు ఉన్నాయని, వీటిని నివారించాలంటే, జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సివుందని చెప్పారు. సాగర తీరం 193 కిలోమీటర్లు వ్యాపించి ఉందని, ఈ తీరంలో పర్యాటక అభివృద్ధి చేపట్టి, మత్స్యకారులకు శీతల గిడ్డంగులు, ఫిషింగ్ జట్టీలు ఏర్పాటు చేస్తే వారికి మేలు కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ మంత్రి జిల్లా నుంచి ప్రాతినిధ్య ఊహిస్తున్నారు కాబట్టి, అత్యధిక నిధులు సాధించి వ్యవసాయ రంగానికి అనుసంధానమైన నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుంటూ మేజర్ మైనర్ ఇరిగేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నానన్నారు. బెంతొరియాల కుల ధ్రువీకరణకు సంబంధించి కూడా మండలిలో ప్రస్తావిస్తానని, జిల్లా సమస్యల పరిష్కారానికి మండల చైర్మన్ మోషేన్ రాజు సహకారంతో ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకు వెళ్తానని, శాసనమండలి సభ్యులు నర్తు రామారావు వివరించారు.

## పేద కుటుంబం.. పెద్ద కష్టం

* 12ఏళ్ల విద్యార్థికి గుండెకు రంధ్రం
* దాతల సాయానికి ఎదురుచూపు



**మందస, నవంబరు 9 (వార్త):** రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.. కాయాకష్టం చేసుకుని.. ఆ దంపతులు కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఏకైక కుమారుడిని చదివిస్తూ ఏదోలా బతుకు దామన్న ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. చిన్న కుటుంబం కావడంతో ఆ పెద్ద కష్టానికి తల్లడిల్లుతున్నారు. దాతల సాయానికై ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మందస పట్టణంలోని పొందరవీధికి చెందిన పొందర ప్రభాకర్, జానకి దంపతులకు ధనుష్ అనే 12 ఏళ్ల కుమారుడు ఉన్నారు. మందసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఉన్నంతలో ఆ కుటుంబ జీవనం సాఫీగా సాగుతోంది. ఇటీవల కుమారుడు ధనుష్ అనారోగ్యానికి గురికావడంతో వైద్య పరీక్షలు చేయించారు. ధనుష్ పుట్టినప్పటి నుంచే గుండెకు రంధ్రం ఉన్నట్టు వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో రక్తం చిక్కగా మారడం.. రక్త ప్రసరణ సరిగ్గా లేకపోవడంతో అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. వైద్యం, చికిత్సకు చాలా ఆసుపత్రుల్లో ధనుష్‌కు చూపించారు. ఇప్పటికే రూ.లక్షల్లో వ్యయమయ్యింది. కానీ, వ్యాధి నయం కాలేదు. ప్రభాకర్ కూడా అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. కుటుంబంలోని ఇద్దరు వృద్ధులు, భర్త, కుమారుడి పోషణ భారం జానకిపై పడింది. సిమెంట్ పనులకు కూలీగా వెళ్తూ జానకి అతి కష్టమ్మీద కుటుంబ భారం మోస్తోంది. ఇల్లు గడవడం ఎంతో కష్టమైన తరుణంలో కుమారుడి అనారోగ్యంతో ఆమె తల్లడిల్లుతోంది. కుమారుడిని రక్షించుకోవడానికి దాతల సాయానికి జానకి ఎదురు చూస్తున్న తరుణంలో ఓ దాత సాయంతో పుట్టపర్తిలోని శ్రీసత్యసాయిబాబా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడి వైద్యులు ఉచితంగా కేవలం ఆపరేషన్ చేయడానికి మాత్రమే అంగీకరించారు. సుమారు మూడు నుంచి నాలుగు నెలల పాటు వైద్య పరీక్షలు, మందులు, ఇతర ఖర్చులకు మాత్రం తాము ఇవ్వలేమని చెప్పడంతో.. పాపం ఆ కుటుంబం బాధలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. కళ్ల ముందే కుమారుడి అనారోగ్యం.. కుటుంబం కష్టం.. జానకిని కలవరపెడుతున్నాయి. దాతలు ఆదుకుంటే తప్ప తమ బాధలు గట్టెక్కవని ఆమె సాయం కోసం అర్థిస్తోంది. ఇప్పటికే సోషల్ వర్కర్ ఇప్పిలి కేశవరావు(చిట్టి) రూ.10వేలును సాయమందివ్వగా, శ్రీషిరిడిసాయి ధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు గిన్ని తిరుపతిరెడ్డి రూ.2వేలు అందజేశారు. అదేవిధంగా మద్ది రవి, సూర్యసంతోష్ చెరో వెయ్యి రూపాయలను ఇచ్చారు. దాతలు 6302329661 జానకి పాత్రో అనే ఫోన్ నంబరుకు సాయం చేయాలని కోరుతున్నారు.



## సైబర్ నేరాలు శోధనలో.. నైపుణ్యమే కీలకం

* పోలీసులు.. సాంకేతిక నైపుణ్యాన్ని పెంపుదించుకోవాలి
* ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
* సైబర్ నేరాలు నియంత్రణ, నేరాల ఛేదనపై గురజాడలో సదస్సు

**శ్రీకాకుళం, నవంబర్ 9 (వార్త):** సైబర్ నేరాలు శోధనలో.. పోలీసుల్లో సాంకేతిక నైపుణ్యం ఉండాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళం రూరల్ మండలంలోని గురజాడ విద్యా సంస్థలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాల దర్యాప్తునకు చేపట్టాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన చర్యలు, సైబర్ నేరాల అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం అనేది నిరంతర ప్రక్రియ ద్వారా లభిస్తుందని, సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్ని కూడా కీలకంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం లభిస్తున్న టూల్స్, బేసిక్ నాలెడ్జ్‌తోపాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్‌తో కేసులు చాకచక్యంగా సులభంగా చేదించవచ్చునన్నారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతున్నదని, ప్రతీ నేరం కూడా సైబరు క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటున్నదన్నారు. ఈ నేరాలను చేధించేందుకు దర్యాప్తు అధికారులకు కూడా ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణ్యం అవసరమని తెలిపారు. వృత్తి నైపుణ్యంను మెరుగుపర్చుకుంటే రాబోయే రోజుల్లో సైబరు నేరాల దర్యాప్తు సులభతరం అవుతుందని చెప్పారు. సైబరు మోసాలకు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, చట్ట పరిధిలో శిక్షించడంతోపాటు, వారు దోచుకున్న నగదును తిరిగి రికవరీ చేసే బాధితులకు న్యాయం చేకూర్చవచ్చునని తెలిపారు. సైబరు నిపుణుడు సాయి రామానుజ మాట్లాడుతూ సైబరు నేరాలను, మోసాలను చేధించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ వేదికగా జరుగుతున్న వేధింపులు, ఓ.టి.పి. ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ లోను యాప్స్ వంటి నేరాల్లో దర్యాప్తు ఏవిధంగా చేయాలి, సాక్ష్యాలను ఏ విధంగా సేకరించాలి, నిందితులను ఏవిధంగా గుర్తించాలన్న విషయాలను పోలీసు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి.హెచ్ వివేకానంద, మహిళ పోలీసు స్టేషన్ డిఎస్పీ రాజశేఖర్, కలశాల ప్రిన్సిపల్ మురళీ కృష్ణ,జిల్లా వ్యాప్తంగా ఉన్న సిఐలు, ఎస్ఐలు,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు,



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546